ఆది వారం
7-1-2024
సంపుటి - 09,
సంచిక - 425
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra P

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## న్యాయం జరిగే వరకు రాహుల్ యాత్ర

### 14 నుంచి 66 రోజుల పాటు న్యాయ్ యాత్ర

భారత్ జోడో న్యాయ్ యాత్ర లోగో విడుదల

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే




**న్యూఢిల్లీ,జనవరి6(సమసమాజం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ నెల 14న ప్రారంభించనున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర లోగోను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. ఈ యాత్ర 'న్యాయం జరిగే వరకు' అన్నారు. పార్లమెంట్‌లో సమస్యలు లేవనెత్తేందుకు ప్రభుత్వం అనుమతించట్లేదని, అందుకే తాము ఈ న్యాయ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. మణిపుర్‌లో ఇటీవల ఎన్నో దురదృష్టకర ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. వాటిపై ప్రధాని మోదీ అనేక చోట్ల ప్రసంగాలిచ్చారు కానీ.. ఆ రాష్ట్రానికి మాత్రం వెళ్లలేదన్నారు. దీనిపై మాట్లాడేందుకు మాకు అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే తొలిసారి 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని, అందుకే తమ గళాన్ని వినిపించేందుకు ప్రజల్లోకి వెళ్తున్నామని చెప్పారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో జనవరి 14న ప్రారంభమయ్యే 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' మార్చి 30న ముగుస్తుందని ఖర్గే చెప్పారు. 66 రోజులపాటు 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాల మీదుగా దాదాపు 6,713 కిలోమీటర్ల పాటు యాత్ర కొనసాగనుందన్నారు.

# ఆరు గ్యారెంటీలతో బిఆర్ఎస్‌లో వణుకు

## అమలు కాకుండా అడ్డంకులు సృష్టించే కుట్రలు

### బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ పడిప్యూటి సిఎం

### ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భట్టి




**ఖమ్మం,జనవరి6(సమసమాజం):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ అడ్డుకుంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అడ్డుపుల్లల వేస్తూ అవినీతిని కప్పిపుచ్చుకునే కుట్రలకు దిగుతోందన్నారు. శనివారం నాడు ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... 6 గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించకపోతే బాగుంటుందని.. బీఆర్ఎస్ , బీజేపీ కలలు కంటున్నాయని.. వారి కలలను నిజం కానివ్వబోమని త్వరలోనే హామీలను అమల్లోకి తీసుకువస్తామని చెప్పారు. డిసెంబర్ 28వ తేదీన కాంగ్రెస్ ఆవిర్భవించిందని.. అదే రోజున 6 గ్యారంటీల అమలుకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తామని ఎన్నికల ముందు ప్రకటించామని హామీలను తప్పకుండా అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలోనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని ప్రజలు విశ్వసించారని అందుకనే ఎన్నికల్లో అద్భుతమైన తీర్పు ఇచ్చారన్నారు. తెలంగాణ సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. అదేవిధంగా పేదలకు మెరుగైన వైద్యం అందాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని 10 లక్షల రూపాయలకు పెంచామన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు కావలసిన బ్జడెట్ ప్రిపరేషన్ కోసమే ప్రజా పాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా కాకముందే ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్

4వ పేజీలో...

## మరో ఘనత సాధించిన ఇస్రో

### గమ్యస్థానం చేరుకున్న ఆదిత్య ఎల్1స్పేస్ క్రాఫ్ట్

హాలో కక్ష్యలోకి వ్యోమనౌకను ప్రవేశ పెట్టిన శాస్త్రవేత్తలు

శాస్త్రవేత్తలను అభినందించిన ప్రధాని మోడీ



**బెంగళూర్,జనవరి6(సమసమాజం):** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో ఘనత సాధించింది. సూర్యున్ని అధ్యయనం చేసేందుకు నింగిలోకి పంపించిన ఆదిత్య ఎల్1స్పేస్ క్రాఫ్ట్ విజయవంతంగా తన గమ్యస్థానాన్ని చేరుకుంది. ఈ స్పేస్ క్రాఫ్ట్ ను తుది కక్ష్యలోకి ప్రవేశ పెట్టేందుకు శనివారం చేపట్టిన కీలక పక్రియ విజయవంతమైంది. భూమి నుంచి సూర్యుని దిశగా 15 లక్షల కి.మీ దూరంలోని లగ్రాంజ్ పాయింట్ చుట్టూ ఉన్న హాలో కక్ష్యలోకి ఈ వ్యోమనౌకను సాయంత్రం 4 గంటలకు ప్రవేశపెట్టారు. ఈ ఉపగ్రహం ఐదేళ్ల పాటు సేవలందించనుంది.

4వ పేజీలో...

## మహాలక్ష్మి అద్భుతంగా అమలు: ఆర్టీసీ ఎండి



**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా తీసుకున్న మహాలక్ష్మి పథకం అద్భుతంగా అమలవుతుందని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. మహిళలు ఆర్టీసీలో ప్రయాణం చేసేటప్పుడు ఒరిజినల్ గుర్తుంపు కార్డు తీసుకొని సిబ్బందికు సహకరించాలని ఎండీ సజ్జనార్ కోరారు. మియాపూర్ డిపో 2లో ఘనంగా వనభోజనాలు

4వ పేజీలో...

## ముగిసిన ప్రజాపాలన దరఖాస్తులు

### కోటి దాటిన దరఖాస్తుల సంఖ్య



**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ముగిసింది. అభయహస్తం కింద ఇప్పటివరకు సుమారుగా కోటి 9 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో గృహలక్ష్మి, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం

4వ పేజీలో...

## త్వరలోనే ప్రజల్లోకి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్

### ప్రజల గుండెల్లోంచి కెసిఆర్‌ను తొలగించలేరు

కోలుకున్నాక ఇక జిల్లాల పర్యటనలు

పెద్దపల్లి పార్లమెంట్ సమీక్షలో హరీష్ రావు వెల్లడి

4వ పేజీలో...




## 13 నుంచి ఇంటర్ విద్యార్థులకు సెలవులు



**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ప్రకటించింది. తెలంగాణలోని జూనియర్ కాలేజీ విద్యార్థులకు సంక్రాంతి సెలవులను ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలకు సెలవులు ఇచ్చారు. సెలవుల సమయంలో తరగతులు నిర్వహిస్తే

4వ పేజీలో...

## మేడారం జాతరకు 75 కోట్లు మంజూరు

నెలాఖరుకు పనులన్నీ పూర్తికి చర్యలు: సీతక్క



**వరంగల్,జనవరి6(సమసమాజం):** తెలంగాణ కుంభమేళాగా పిలువబడే మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇది కేవలం తెలంగాణలోనే కాక ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధికెక్కిందని మంత్రి సీతక్క అన్నారు. మేడారం భక్తుల కోసం సీఎం రేవంత్ రెడ్డి రూ. 75 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. అధికారులంతా

4వ పేజీలో...

## జోరుగా పెండింగ్ చలాన్ల క్లీయరెన్స్

రూ. 67 కోట్లు వసూలయినట్లు వెల్లడి



**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** తెలంగాణలో పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల క్లియరెన్స్‌కు విశేష స్పందన లభిస్తోంది. ట్రాఫిక్ చలాన్ల చెల్లింపులకు ప్రభుత్వం భారీగా డిస్కౌంట్ ఇచ్చిన నేపథ్యంలో వాహనాదారులు చలాన్లను చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. ఇప్పటి వరకు

4వ పేజీలో...

## పట్టువదలని విక్రమార్కుడిలా....

# రేవంత్ పరుగులు

అన్నం ఉడికిందా లేదా అన్నదానికి ఒక్క మెతుకు పట్టుకుని చూస్తాం.. ఉడికిందో లేదో తెలిసిపోతుంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నెలరోజులు పూర్తి చేసుకుంటోంది. నాయకుడంటే ఎలా ఉండాలో మెల్లగా అలవాటు చేస్తున్నారు. దర్పం, డాంబికం లేకుండా ముందుకు సాగుతున్నారు. ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చాలా అన్న తపనతో పనిచేస్తున్నారు. చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. సరిగ్గా డిసెంబర్7న ప్రభుత్వం కొలువుదీరింది. ఈ నెలరోజుల్లో చేసిన.. చేస్తున్న.. చేయబోతున్న పనులు.. వ్యవహరిస్తున్న తీరు..శ్రమిస్తున్న తీరు చూశాక, ప్రజల్లో ముఖ్యంగా తెలంగాణ ఏర్పాటు కోసం కొట్లాడిన వారిలో భరోసా కలిగింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను మెల్లగా నెరవేర్చే ప్రయత్నం చేస్తున్న తీరును అభినందించాల్సిందే. ఎక్కడా భేషజాలకు పోకుండా రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారు. ఢిల్లీ పర్యటనలో కావచ్చు.. హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమా ల్లో కావచ్చు.. తనతోటి సహచర మంత్రులకు విలువను ఇస్తున్నారు. తానే సర్వం అనే డాంబికాలు ప్రకటించడం లేదు. తొలిసారి ఢిల్లీ వెళ్లినపుడు డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతుంటే సింపుల్‌గా వింటూ కూర్చున్నారు. తరవాత ఉత్తమ్ కుమార్ రెడ్డితోనూ ఢిల్లీ వెళ్లినప్పుడు ఇలాగే వ్యవహరించారు. కేంద్రమంత్రులను కలిశాక ఉత్తమ్ మాట్లాడు తుంటే సిఎంగా ఉండీ రేంవత్ రెడ్డి పక్కన కామ్‌గా ఉన్నారు. నిజానికి నాయకత్వం అంటే ఇలాగే ఉండాలి. పక్కన వారు చెప్పేది వినాలి. తరవాత ఏదైనా ఉంటే వారిలో వారు మాట్లాడుకోవాలి. నడత లోనూ, నడకలోనూ, తోటివారితో ఉన్నప్పుడు సింపుల్‌గా ఉన్నంత మాత్రాన మన గౌరవానికి వచ్చే భంగం ఏదీ ఉండదు. అహంకారంతో కూడిన అధికారం ఎప్పుడూ ముప్పు తెచ్చి పెడుతుంది. కోటరీని ఏర్పాటు చేసుకుని వారి భజనలకు పొంగిపోతే క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలియదు. ఎంత హుందాగా, సింపుల్‌గా ఉంటే అది పదవికి, దానిని నిర్వహిస్తున్న వారికి గౌరవం ఇనుమడించేలా చేస్తుంది. ఇప్పుడు రేవంత్ కూడా అదే చేస్తున్నారు. అనేక అంశాల్లో చకచకా నిర్ణయాలు తీసుకుంటున్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట మేరకు ఉద్యోగాల భర్తీపై తన చిత్తశుద్ధిని ప్రకటించారు. యూపిపిఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పటిష్టతపై దృష్టి సారించారు. కమిషన్‌ను రాజకీయ చట్రం నుంచి విముక్తం చేసేందుకు సిద్దం అయ్యారు. అలాగే 2లక్షల ఉద్యోగాల భర్తీని ఏడాదిలోగా పూర్తి చేస్తామని చెప్పారు. మెగా డిఎస్సీతో టీచర్ పోస్టుల భర్తీకి ఆదేశించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూసేసిన స్కూళ్లను పునరుద్ద రించాలని ఆదేశించారు. జర్నలిస్టుల సమస్యలను వందరోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ధరణిపైనా దృష్టి సారించారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ఆరా తీస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే.. అనేక సమస్యలపై బహుముఖ పోరు సాగుతోంది. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా తెలంగాణ అప్పులకుప్పగా మారింది. ఓ వైపు అప్పులను తేర్చగలగాలి. ఇచ్చిన హామీలను నెరవేర్చ గలగాలి. ఈ రెండు లక్ష్యాలతో రేవంత్ ప్రయాణం సాగుతోంది. ఆర్భాటాలకూ, భేషజాలకూ దూరంగా ఉంటూ.. ప్రజల్లో కలిసిపోతూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ప్రజాభవన్‌ను ప్రజల దగ్గరకు చేర్చారు. సమస్యలు వినే ప్రభుత్వం వచ్చిందన్న భరోసా కల్పించారు. ప్రగతి భవన్‌కు ముందు ఉన్న ఇనుప కంచెలను పగలగొట్టించి, దాన్ని ప్రజాభవన్‌గా ప్రకటించారు. ప్రగతి భవన్ ప్రజలకు దూరంగా ఉందనే విషయాన్ని తన ఎన్నికల ప్రచార సభలలో పదేపదే చెబుతూ వచ్చినందున.. దానిని ప్రజలకు చేరువ చేస్తామన్న హామీని నెరవేర్చుకున్నారు. ఇకపోతే అప్పులపై దృష్టి సారించారు. అసెంబ్లీ వేదికగా శ్వేతపత్రాల ద్వారా ఉన్న అప్పులను, ఆర్థిక పరిస్థితిని ప్రజల ముందుంచారు. మీరు సూచనలు సలహాలు ఇచ్చి, ముందుకు నడవడానికి సహకరించాలని విపక్షాన్ని కోరారు. అయితే అంత సులువుగా వారు ముందుకు రాలేదు. రారుకూడా. రాళ్లను పోగేసి విసర డానికి సిద్దంగా ఉన్నవారు..తమ తప్పులను అంగీకరించడానికి కూడా సిద్దంగా లేరని చెప్పారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తేవాలంటే కేంద్ర సహకారం తప్పనిసరి. అందుకనే రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. కేంద్రాన్ని కలసి పరిస్థితిని వివరించారు. రావాల్సిన నిధులను ఇవ్వాలని కోరారు. ఆదుకోవాలని అర్థించారు. ఢిల్లీలో ఉమ్మడి ఎపి భవన్ సమస్యను పరిష్కరించే చర్యలకు ఉపక్రమించారు. త్వరలోనే నవ్య తెలంగాణ భవన్ నిర్మాణం చేపడ తామని ప్రకటించారు. పాత అసెంబ్లీలో మండలి సమావేశాలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అసెంబ్లీ ముందు ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన కంచెలను తొలగించారు. ఇకపోతే అన్నింటికి మించి మెట్రోను విస్తరించే పథకంపై అధ్యయనం చేయడం. శంషాబాద్ విమానాశ్రయం వరకు పొడిగింపుతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్దం చేయాలని ఆదేశించారు. అవుటర్ రింగు రోడ్డు, రీజనల్ రింగు రోడ్డు మధ్య ఫార్మా సిటీని విడతల వారీగా జీరో కాలుష్యంతో క్లస్టర్లు గా ఏర్పాటు చేస్తామని అన్నారు. పదవులు, నామినేటెడ్ పోస్టుల భర్తీలో తనవాళ్లంటూ ఎవరూ ఉండరనీ, పార్టీ కోసం కష్టపడ్డవారిని గుర్తించి పదవులు ఇవ్వడం జరుగుతుందని చెప్పేశారు. దీనిద్వారా పదవుల భర్తీలో అర్హులకే అవకాశం అని చెప్పారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల జీతాలు, పెన్షన్లు సకాలంలో ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. దీనిని సమీక్షించిన సిఎం రేవంత్ ముందుగా జీతాలు సకాలంలో పడేలా చేయాలనుకున్నారు. సకాలంలో జీతాలు అందక ప్రభుత్వోద్యోగులు,పెన్షనర్లు ఇబ్బంది పడకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదటి నెలలోనే జీతాల చెల్లింపును గాడిన పెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. జనవరి నెల ఒకటిన ఇవ్వవలసిన జీతాల చెల్లింపును నాలుగో తేదీనాటికి ముగించడం గమనార్హం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఒకటో తేదీనే జీతాలను చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఈమేరకు కాస్త అటూ ఇటూగా మొదటి నెలలోనే ప్రభుత్వం తాను ఇచ్చిన హామీని నెరవేర్చే ప్రయత్నం చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే నెలరోజుల్లో ఎన్నో పనులు జరిగాయి. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరిం చేందుకు యంత్రాంగం సిద్దం అవుతోంది. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిశీలనా జరుగుతుంది. రాజకీయమంటే ప్రజలకు సేవచేయడం అన్న సిద్ధాంతంతో ముందుకు సాగుతున్న రేవంతం రెడ్డి అనతి కాలంలోనే ప్రజల్లో పేరు తెచ్చుకుని సమర్థ ముఖ్యమంత్రిగా సుస్థిర స్థానం సంపాది స్తారనడంలో సందేహం లేదు. నెలబాలుడు దినదిన పరవర్ధమానంగా ప్రజాభిమానిగా ఎదగాలని కోరుకుందాం.

# బిఆర్ఎస్‌లో తొందరపాటు

### ప్రభుత్వాన్ని నిలదీయడం లక్ష్యంగా ప్లాన్



**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల ప్రచారంలో చెప్పిన హామీల ప్రకారం మరిన్ని పథకాలను అమలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కొన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడంపై కాంగ్రెస్ అశ్రద్ద వహిస్తోందంటూ బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అందుకుగాను రేవంత్ సర్కార్‌పై యుద్ధం ప్రకటించింది బీఆర్ఎస్. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. మరి, ఈ నిరసనలు ఎందుకో? దేనికోసమో ఇప్పుడు తెలుసుకుందాం. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై ఆందోళనలకు సిద్ధమవుతోంది బీఆర్ఎస్. సిద్ధమవడమే కాదు.. ఆల్రెడీ నిరసనలకు పిలుపునిచ్చేసింది ప్రతిపక్షం. గృహలక్ష్మి, దళితబంధు, గొర్రెల పంపిణీ వంటి సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిందే అంటోన్న బీఆర్ఎస్.. వాటిని రద్దుచేస్తే ఊరుకునేది లేదంటూ వార్నింగ్ ఇస్తోంది. ప్రజలకు లబ్ది చేకూర్చే సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేయడమంటే బలహీనవర్గాలకు తీరని ద్రోహం చేయడమేనని మండిపడుతోంది. పార్టీ నేతలు, శ్రేణులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన కేటీఆర్, హరీష్.. ఆయా పథకాలను రద్దుచేస్తే పెద్దఎత్తున నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలకు లబ్ది చేకూర్చే పథకాలను రద్దుచేస్తే చూస్తూ ఊరుకోబోమంటూ అల్టిమేటం ఇచ్చారు కేటీఆర్. ప్రజాసంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి, దళితబంధు లాంటి పథకాలను కొనసాగించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒకవేళ ఈ పథకాలను రద్దుచేస్తే మాత్రం పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పట్టణాల అభివృద్ధికి గత ప్రభుత్వం కేటాయించిన నిధులను కూడా నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. ఇలాగైతే ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు కేటీఆర్. వీటన్నింటిపై ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలకు సూచించారు. ప్రజాసంక్షేమం కోసం లబ్దిదారుల తరపున ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

# గ్రామస్థాయి ప్రణాళికలతో సాగాలి !

### నినాదాలు కాకుండా విధానాలు పటిష్టం చేయాలి ● గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంతోనే సమస్యలకు చెక్

**న్యూఢిల్లీ,జనవరి6(సమసమాజం):** మన విధానాలు మారాలి. ప్రణాళికలు మారాలి. ప్రజలు ఎప్పుడూ దరఖాస్తులతో ప్రభుత్వం దగ్గరకు రాకుండా నిరంతరాయంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్.. అన్న నినాదాలు తప్ప గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బాగుచేసే కార్యక్రమాలు అమలు కావడం లేదు. నేలవిడిచి సాము చేసే పథకాలతో దేశం ఆర్థికంగా కుంగిపోతోంది. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకుని.. సమీక్షించే తీరిక పాలకులకు ఉండడం లేదు. దేశం బలపడాలంటే గ్రామాలు బలపడాలి. గ్రామాలు ఆర్థికంగా వృద్ది చెందాలి. వ్యవసాయం బలపడాలి. అన్నదాతలు ఆర్థికంగా బలపడితేనే అనుబంధ రంగాలు పెరుగుతాయి. అయితే వ్యవసాయికంగా మనం పంటల ఉత్పత్తిలో చూపిస్తున్న శ్రద్ద వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అన్ని విధాలుగా మనమంతా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ ఒక్క సూత్రాన్ని పాటిస్తే పంట ఉత్పత్తులతో పాటు..నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడమే గాకుండా...గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడగలం. గ్రామస్థాయిలో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగడం లేదు.గ్రామీణ అర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా సర్పంచ్‌ను బాధ్యులను చేసేలా కార్యక్రమాల అమలు జరగడం లేదు. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడం తో పాటు ప్రణాళికలు సిద్దం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్దం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. సర్పంచ్ లను, గ్రామ వార్డు సభ్యులను బాధ్యులను చేయాలి. అప్పుడే ఏ పథకం అయినా ఆశించన ఫలితం అందిస్తుంది. గ్రామాలకు నేరుగా నిధులు విడుదల చేస్తున్నా అవి వారికి చేరడం లేదు. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేకపోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్ల గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలు మొదలు ఇతరత్రా కార్యక్రామలు బలంగా ముందుకు సాగడం లేదు. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగత మైన శ్రద్దకు సంబంధించి నదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ద తక్కువనే చెప్పాలి. ఇప్పటికీ ఆరుబయట మల విసర్జన అన్నది అలవాటుగా కొనసాగుతోంది. నిత్యం టీవీల్లో పేపర్లలో ప్రకటనల ద్వారా ప్రజల్లో చైతన్యానికి కృషి చేస్తున్నా వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణాలు పూర్తి కావడం లేదు. కరోనా లాంటి వైరస్‌లు విజృంభించి అనారోగ్యాల బారిన పడుతున్నా ..ఇందుకు అపరిశుభ్రతే కారణమని ప్రజలు గ్రహించడం లేదు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మురుగు నీరు ఎక్కడపడితే అక్కడ వచ్చి చేరుతోంది. నిజానికి కార్యక్రమాల్లో ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. ఆరుబయట మలవిసర్జన కారణంగా మనదేశంలో అనారోగ్యకర వాతావారణం ఎక్కువే. అలాగే వ్యాధుల సంక్రమణ, అంటువ్యాధుల వ్యాప్తి కూడా ఎక్కువే. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల కారణంగా గ్రామాల్లో జోరుగా దీనిపై శ్రద్ద పెడుతున్నా లక్ష్యాన్ని మాత్రం సాధించడం లేదు. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పంచాయతీల్లో జనాభాకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పల్లెలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రధానంగా అన్ని పనులను ప్రభుత్వ మే చేస్తుందన్న ధీమాలో ప్రజలు ఉన్నారు. ఓటుబ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయారయ్యారు. వారిని బాధ్యులను చేసేలా చర్యలు ఉండడం లేదు. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రతా లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లు తున్నాయి. తాజాగా కరోనా ఇంకా విజృంభించడానికి పరిశుభ్రతా లోపం కూడా కారణంగా చూడాలి. కరోనాలాంటి వైరస్‌లను అరికట్టాలంటే పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. మురికివాడల వద్ద ఖాళీ ప్రదేశాలు, పొలం ప్రాంతాలు, గ్రామ శివారు స్థలాలు, రైలు పట్టాల పరిసరాల్లో కాలకృత్యాలు హానికరంగా పరిణమిస్తున్నాయి. అధికారుల నిర్లిప్తత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వ్యక్తిగత మరగుదొడ్లు నిర్మించు కోకుంటే ప్రభుత్వ పథకాల అమలు నిలిపి వేస్తామని హెచ్చరించడం మొదలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలతో ప్రచారం సాగుతున్నట్లుగానే కరోనా తదితర వ్యాధులపైనా చైతన్యం తీసుకుని రావాలి.

# పార్లమెంట్ ఎన్నికల వరకు పిసిసి చీఫ్ రేవంతే

### అప్పుడే మార్పే ఆలోచన లేని కాంగ్రెస్ ❑ఎన్నికల్లో ఎక్కువ ఎంపి సీట్లు సాధించడమే లక్ష్యం



**న్యూఢిల్లీ,జనవరి6(సమసమాజం):** పిసిసి అధ్యక్షపదవి విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఇప్పుడే తొందరపాటు నిర్ణయం తీసుకునే అవకావం కనిపించడం లేదు. పార్లమెంట్ ఎన్నికల వరకు పిసిసి చీఫ్‌గా రేవంత్ రెడ్డినే కొనసాగిస్తారన్న ప్రచారం సాగుతోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చిన రేవంత్ రెడ్డిని ఈ ఎన్నికల వరకు కొనసాగించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. పలువురి దృష్టి పిసిసి పదవివపై ఉన్నా.. ఇప్పటికిప్పుడు మార్చే అవకాశం లేదని అంటున్నారు. పార్లమెంటులో కనీసం 14 సీట్లు గెలవాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ముందుకు సాగుతోంది. సిఎం రేవంత్ ఇప్పుడు తన దృష్టినంతా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపి సీట్లు సాధించడంపై పెట్టారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఇదే కోరుకుంటోంది. అందువల్ల పిసిసి చీఫ్‌గా రేవంత్ రెడ్డినే కొనసాగించాలన్న నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే పార్లమెంట్ ఎన్నికల వరకు రేవంత్ రెడ్డి సిఎంగాను, పిసిసి చీఫ్‌గానూ కొనసాగుతారు. పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన రేవంత్ రెడ్డిపై అధిష్ఠానం ఎంతో నమ్మకంగా ఉంది. అందుకనే ముఖ్యమంత్రి పదవితోపాటు పార్టీ పగ్గాలను కూడా ఆయన వద్దే ఉంచింది. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రిగా ఉన్నవారే పిసిసి అధ్యక్షుడిగానూ రేపోమాపో కొన్నిపోస్టుల భర్తీ జరుగుతుందనీ తెలుస్తోంది. మంత్రులలో చాలామంది కంటే వయసులో రేవంత్ చిన్నవారు. వయసులోనూ, పార్టీలోనూ తనకంటే అనుభవం ఉన్నవారనే ఉద్దేశంతో మంత్రులకు సముచిత గౌరవం ఇచ్చి ముందుకు తీసుకుని వెళుతున్నారు. ఇకపోతే లోక్‌సభ ఎన్నికల్లో సోనియా గాంధీని తెలంగాణనుంచి పోటీ చేయించాలన్న నిర్ణయం వెనక కూడా పార్టీ విజయం ఆధారపడి ఉంది. అదే జరిగితే, సోనియాగాంధీ ఇమేజీతో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఎక్కువ సీట్లు గెలుచుకునే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాల అమలు రేవంత్ ప్రభుత్వానికి ఒక సవాల్ అనే చెప్పాలి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వం, సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు జరపడం కత్తిమీద సాములాంటిదే. అయితే చిత్తశుద్ధితో ముందుకు సాగాలని నిర్ణయించడం ద్వారా ఒక్కో పథకాన్ని గట్టెక్కించవచ్చు. అందుకే పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ సాగాలి. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమస్యలు సులువుగా పరిష్కరించుకోవచ్చు. అందుకే ఎంపి ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలవాలి. అప్పటివరకు రేంవత్ ఉంటేనే పార్టీ గట్టెక్కే పరిస్థితులు ఉన్నాయి.

# కెసిఆర్‌ను కాపాడేందుకే సిబిఐ డిమాండ్

### బిజెపి తీరుపై మండిపడ్డ జీవన్ రెడ్డి

### కాళేశ్వరం అవినీతి నిగ్గు తేల్చాల్సిందేనని వ్యాఖ్య



**జగిత్యాల,జనవరి6(సమసమాజం):** కాళేశ్వరం అవినీతిపై విచారణ చేయడం బిజెపికి కూడా ఇష్టం లేనట్లుగా ఉందిన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కోసం బీజేపీ రెస్క్యూ ఆపరేషన్ చేస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జ్యూడిషియల్ విచారణకు కాంగ్రెస్ ఆదేశిస్తే బిజెపి భుజాలు తడుముకుంటోందని మండిపడ్డారు. సిబిఐ విచారణతో కేసు క్లోజ్ చేయాలన ఇచూస్తోందని మండిపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌ను కాపాడటం కోసమే సీబీఐని వాడుతోందని ఆరోపించారు. కేసీఆర్ తప్పులు బయటపడకుండా బీజేపీ జాగ్రత్త పడుతోందన్నారు. కవిత కేసును కావాలనే తొక్కి పెట్టారన్న విషయం ప్రపంచానికి తెలిసిపోయిందన్నారు. బీజేపీ - కేసీఆర్ ఇద్దరూ ఒక్కటే అని మొన్నటి ఎన్నికల్లో రుజువు అయ్యిందని గుర్తు చేశారు. కేసీఆర్ తలను సీబీఐ చేతిలో పెట్టారన్నారు. కాళేశ్వరం ఒక డొల్ల ప్రాజెక్టు అని.. కాళేశ్వరంపై న్యాయ విచారణ తప్పదని స్పష్టం చేశారు. బీజేపీ - కేసీఆర్ విధానాలను మేథావులు, న్యాయ కోవిధులు గమనించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కెసిఆర్ అవినీతిపై ఏనాడూ బిజెపి ఎందుకు విచారణ చేయలేదని ప్రశ్నించారు. దమ్ముంటే గత పదేళ్లలో ఎందుకు ఆదేశం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ విచారణకు దిగితే అడ్డుకునే ప్రయత్నం చేయడం దారుణవమేం అన్నారు. బిజెపి తీరు ఇలాగే ఉంటే ప్రజలు ఛీత్కరించుకుంటారని అన్నారు.

# ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం

### ప్రజాపాలనలో దరఖాస్తులను పరిశీలిస్తున్నాం

### మంత్రి దామోద్ర రాజనర్సింహ వెల్లడి




**మెదక్,జనవరి6(సమసమాజం):** తెలంగాణలో ఆరు గ్యారెంటీలను తప్పకుండా ఆచరణలోకి తీసుకొస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పేదలకు న్యాయం చేస్తామని అన్నారు. ఇందుకోసం కసరత్తు జరుగుతోందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం కాంగ్రెస్ విధిగా భావిస్తోందని స్పష్టం చేశారు. శనివారం మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో నిర్వ హించిన ప్రజాపాలనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రూ 10 లక్షలతో ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తోందని , ఇప్పటికే మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించిందని గుర్తు చేశారు.ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు అందజేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక విజన్ ఉందని పేర్కొన్నారు. గత కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ పాలనను ప్రజలకు అందించామని వివరించారు. రాజకీయం శాశ్వతం కాదని వ్యవస్థ ముఖ్యమని అన్నారు. తాను విద్యా శాఖ మంత్రిగా ఉన్న కాలంలో మోడల్ స్కూల్స్, కేజీబీవీలను ఏర్పాటు చేశామని తెలిపారు.

# ఫార్ములా రేస్‌తో ప్రజలకు ఉపయోగం లేదు

### రద్దు చేయడం వల్ల వచ్చే నష్టం లేదన్న నిరంజన్



**హైదరాబాద్, జనవరి 6 (సమసమాజం):** ఫార్ములా రేస్ వల్ల హైదరాబాద్ నగర ప్రజలు గతంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని.. ఇప్పుడు రేస్ కోసం ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ నేత నిరంజన్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ట్రాఫిక్‌ను స్తంభింప చేసి గత ప్రభుత్వం అవివేక నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందుల్లో పడి.. అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రేస్ వల్ల ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం ఉండదన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ ఈ రేస్‌ల వల్ల పెట్టుబడులు వస్తాయని చెప్పడం తెలివి తక్కువతనమన్నారు. ఫార్ములా రేస్‌లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తున్నదని అన్నారు. ఎమ్మెల్సీ కోటా కింద రెండు స్థానాలు ఖాళీగా ఉన్నా ఎన్నికలు వేరువేరుగా జరుగుతాయని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసిందన్నారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కూడా ఇలాగే జరిగాయన్నారు. ఇప్పుడు జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక అని... సాధారణ ఎన్నిక కాదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే ఎన్నికలు జరుగుతాయని నిరంజన్ పేర్కొన్నారు. . హైదరాబాద్‌లో ఫిబ్రవరి 10న జరగాల్సిన ఫార్ములా - ఈ రేస్‌ను రద్దు చేయడం జరిగింది. ఎఫ్ఐఏ ఈ నిర్ణయం వెల్లడించింది. ఏర్పాట్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. గతంలో చేసుకున్న ఒప్పందం ఉల్లంఘనపై మున్సిపల్ శాఖకు నోటీస్ ఇస్తామని ఫార్ములా ఈ రేస్ నిర్వాహకులు పేర్కొన్నారు.వ్యవహరించిన దాఖలాలు తక్కువ. ఇప్పటివరకూ తెలుగునాట ఒక్క సందర్భంలోనే అలా జరిగింది. మర్రి చెన్నారెడ్డి మొదటిసారి ముఖ్య మంత్రి అయిన ప్పుడు కొంత కాలం ఆయన పిసిసి అధ్య క్షుడుగానూ వ్యవహరించారు. ఆ తర్వాత మళ్లీ ఆ ఘనత రేవంత్ రెడ్డికే దక్కింది. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడిన తరుణంలో పిసిసి అధ్యక్ష పదవిని మరొకరికి కట్టబెడితే లేనిపోని వివాదాలు తలెత్తే ప్రమాదం ఉంది. పైగా అసెం బ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపించిన రేవంత్, లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయం చేకూ రుస్తాడనే నమ్మకంతో పిసిసి అధ్యక్ష పదవిని మార్చకేడదన్న నిర్ణయ ంతో ఉంది. పార్టీపై కూడా రేవంత్ తనదైన శైలిలో పట్టు సాధిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కప్పల తక్కెడ అనీ, అసమ్మతులకు కేరాఫ్ అడ్రస్ అనీ పేరు. రేవంత్ కి ఈ విషయం ఇంకాస్త ఎక్కువే తెలుసు. అందుకనే మొదటి రోజునుంచీ పార్టీలో అందరినీ కలుపుకుపోయే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఎలాంటి భేషజాలకూ పోవడం లేదు. కాంగ్రెస్‌లో ఉన్న సీనియర్లను గౌరవిస్తూనే తను నిమిత్త మాత్రుడిని అన్న రీతిలో ముందుకు సాగుతున్నారు. వారందరిని మంత్రులుగా తీసుకున్నా కలుపుకుని పోతున్నారు. మొదటిసారిగా ప్రధాని మోడీని కలిసేందుకు అపాయింట్ మెంట్ లభించినప్పుడు, రేవంత్ ఒక్కరే వెళ్లి ప్రధానిని కలిసి ఉండవచ్చు. కానీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కూడా వెంటబెట్టుకుని వెళ్లారు. ఆ తర్వాత ఢిల్లీలో జరిగిన ప్రెస్ మీట్ లోనూ భట్టికి మైక్ ఇచ్చి మాట్లాడమన్నారు. తాను ప్రధానితో ఏం మాట్లాడననే విషయమై పార్టీలో వదంతులు రేకెత్తకూడదని ముందుచూపుతోనే ఆయన ఇలా చేశారు. అలాగే ఉత్తమ్‌తో కలసి వెళ్లిన్పుడు కూడా ఇలాగేచేశారు. కేంద్రమంత్రులను కలిసిన వివరాలను ఉత్తమ్ వివరించారు. మంత్రులకు శాఖల కేటాయింపుల కూడా ఢిల్లీ పెద్దల అనుమతితోనే చేపట్టారు. గతంలో ముఖ్యమంత్రి ఏ నిర్ణయం తీసుకున్నా, మంత్రుల్లోనూ, ఎమ్మెల్యేలలోనూ అసమ్మతి మొదలయ్యేది. ఢిల్లీకి వెళ్లి ముఖ్యమంత్రిపై అధిష్ఠానానికి ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పేవారు. ఈ సంస్కృతికి రేవంత్ చెక్ పెడుతూ, తన నిర్ణయాలకు ముందుగానే అధిష్ఠానం అనుమతి తీసుకుంటున్నారు. నామినేటెడ్ పదవుల విషయంలోనూ అయన అధిష్ఠానం అనుమతి తీసుకున్నారని తెలిపారు.

# అయోధ్య ప్రాణప్రతిష్ట రోజు మహాహారతి

## నాసిక్ కలారాం ఆలయం వద్ద నిర్వహణ



శివసేన నేత ఉద్దవ్ థాక్రే వెల్లడి

**ముంబై,జనవరి6(సమసమాజం):** అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ట కార్యాక్రమానికి చాలా మంది నేతలకు ఆహ్వానం అందలేదు. వీరిలో శివసేన(యుబీటీ) అధినేత ఉద్దవ్ ఠాక్రే కూడా ఒకరు. తనకు ఇంకా ఎలాంటి ఆహ్వానం అందలేదని ఠాక్రే ఇప్పటికే వెల్లడించారు. తాజాగా ఉద్దవ్ తన తల్లి జయంతి సందర్భంగా ఆమెకు నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రామమందిర ఆలయం ప్రారంభోత్సవం రోజే తనతోపాటు తన పార్టీ నేతలు నాసిక్‌లోని కలారాం ఆలయానికి వెళ్లి అక్కడ గోదావరి నది ఒడ్డున మహాహారతి నిర్వహించనున్నట్లు చెప్పారు. తనకు శ్రీరాముని దర్శనం కావాలని అనిపిస్తే అయోధ్యను సందర్శిస్తానని పేర్కొన్నారు. అయోధ్య రామ మందిర నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన గర్వించదగ్గ విషయమని, ఆత్మగౌరవానికి సంబంధించినదని తెలిపారు. జనవరి 22 సాయంత్రం 6.30 గంటలకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, సానే గురూజీ నిరసనలు చేసిన కాలరామ్ సదర్శించి గోదావరి నది ఒడ్డున మహా హారతి నిర్వహిస్తాం' అని ఠాక్రే చెప్పారు. కాగా రామజన్మభూమి ఉద్యమం కోసం 'శివసేన' సుదీర్ఘ పోరాటం చేసిందని గతవారం ఉద్ధవ్ తెలిపిన విషయం తెలిసిందే. రాముడు కొలువై ఉన్న కలరాం ఆలయం నాసిక్‌లోని పంచవటి ప్రాంతంలో ఉంది. నల్లరాతితో చెక్కిన రాముడి విగ్రహం ద్వారా ఆ ఆలయానికి ఆ పేరు వచ్చింది. రాముడు వనవాస సమయంలో భార్య సీత, సోదరుడులక్ష్మణుడితో పంచవటిలో ఉండేవారని భక్తులు విశ్వసిస్తారు. 1930లో దళితులను ఆలయంలోకి ప్రవేశించాలని కోరుతూ డాక్టర్ అంబేద్కర్ కాలారాం ఆలయం వద్ద ఆందోళనలు చేపట్టారు.

# స్టాక్ మార్కెట్ పేరుతో మోసాలు

## దుబాయ్ నుంచి ఆన్ లైన్లో లావాదేవీలు

ఇద్దరు సైబర్ క్రైమ్ నిందితుల అరెస్ట్

హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** మనకు తెలియకుండానే మన పేరిట బ్యాంక్ అకౌంట్ ఓపెన్ అవుతుంది.. అందులో ట్రాన్సాక్షన్స్ కూడా జరుగుతాయి. బయటి నుంచి డబ్బులు వచ్చి ఖాతాలో పడతాయి.. ఆ తర్వాత క్యాష్ విత్ డ్రా కూడా వెంటవెంటనే జరిగిపోతూ ఉంటుంది. మనకు సంబంధం లేకుండా ఆ ఖాతా నుంచి లక్షల రూపాయలు చేతులు మారతాయి. ఇలా సరికొత్త తరహాలోసైబర్ నేరాలు జరుగుతున్నాయి. ఈ తరహాలో ఆన్ లైన్ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 1.4 కోట్ల నగదు, ల్యాప్ టాప్ లు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు.'హైదరాబాద్ కు చెందిన బాధితురాలు తాను 3 కోట్ల 16 లక్షలు నష్టపోయాయని పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. దర్యాప్తు ప్రారంభించి నిందితుడు రోనక్ తన్నాను గోవాలో అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ స్కామ్ అంతా దుబాయ్ నుంచి జరిగినట్లుగా అతను ఒప్పుకున్నడు. నిందితుడి బ్యాంక్ అకౌంట్ లో రూ. 20 లక్షలు ఫ్రీజ్ చేశాం. అతడికి సహకరించిన మరో ఇద్దరికి నోటీసులు ఇచ్చాం. ఈ కేసులో నిందితుడు ఇతరులకు చెందిన 95 బ్యాంక్ అకౌంట్స్ వాడుతున్నాడని గుర్తించాం' అని సీపీ తెలిపారు. డఫాబెట్ వెబ్‌సైట్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని చెప్పి మోసం చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి డఫాబెట్‌లో రూ. 70లక్షలు పెట్టి ఆన్‌లైన్ గేమ్ ఆడారని.. ఆ తర్వాత మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారని సీపీ తెలిపారు. సింగపూర్, హాంకాంగ్ నుంచి నిందితులు ఫోన్లు చేస్తూ.. భారీగా లాభాలంటూ నమ్మించి మోసాలకు దిగుతారన్నారని చెప్పారు. హర్యానాకు చెందిన హితేశ్ గోయల్ మోసాలు చేశాడని.. నిందితున్ని ఢిల్లీలో అరెస్టు చేశామని తెలిపారు . నిందితుడి నుంచి రూ.1.40 కోట్ల నగదు సీజ్ చేశామని తెలిపారు. సోషల్ మీడియాలో నిందుతులు కనెక్ట్ అవుతారని పాస్ వర్డ్స్, ఓటీపీ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లపై ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.

# ఇస్రోకు సిఎం జగన్ అభినందనలు



**అమరావతి,జనవరి6(సమసమాజం):** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సైంటిస్టులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్‌-1 అద్భుత విజయంపై సీఎం జగన్ హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఇస్రో మరిన్ని విజయాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రయోగించిన ఆదిత్య ఎల్‌-1 మిషన్ శనివారం అద్భుత విజయం సాధించింది. ఆదిత్య వ్యోమనౌక సాయంత్రం 4 గంటలకు సూర్యుడికి అతి సమీపంలో లాంగ్రేజియన్ పాయింట్‌లోకి ప్రవేశించింది. ఈ వ్యోమనౌక అంతరిక్షంలో 127 రోజుల పాటు 15 లక్షల కిలోమీటర్లు ప్రయాణించి ఎల్‌-1 పాయింట్‌లోకి ప్రవేశించింది.

# కేరళ అయ్యప్ప బస్సులో అగ్నిప్రమాదం



**పంబ,జనవరి6(సమసమాజం):** అయ్యప్పలు ప్రయాణించే కేఎస్ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. పంబా... నీలక్కల్ మార్గ మధ్యలో కేఎస్ ఆర్టీసీ బస్సులో అగ్నిప్రమదం సంభవించింది.ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు చెబుతున్నారు. నీలక్కల్ నుంచి అయ్యప్ప యాత్రికులతో పంబకు చేరుకున్న కేరళ ఆర్టీసీ బస్సులో శనివారం ఉదయం 8:30 గంటలకు బస్సులో మంటలు చెలరేగాయి. సమీపంలోనే అగ్నిమాపక కేంద్రం ఉండడంతో మంటలు అదుపుచేశారు. అప్పుడే అయ్యప్పలు అందరు బస్సు దిగారు. మంటలు చెలరేగిన సమయంలో బస్సులో డ్రైవర్, క్లీనర్ మాత్రమే ఉన్నారు. బస్సు మధ్యలో నుంచి మంటలు రావడంతో అప్రమత్తమైన వారు బస్సు దిగారు. ఎదురుగా అగ్నిమాపక కేంద్రం ఉండటంతో అప్రమత్తమైన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

# బోటులో అగ్నిప్రమాదం: ఒకరు మృతి



**కాకినాడ,జనవరి6(సమసమాజం):** కేంద్రపాలిత ప్రాంతం యానాంలో అగ్ని ప్రమాద ఘటన చోటుచేసుకుంది. యానాంలోని దరియాలతిప్ప వద్ద ఓ బోటు అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో బోటులో చిక్కుకున్న వ్యక్తి సజీవదహనమయ్యారు. వివరాల ప్రకారం.. యానాంలో బోటు ప్రమాదం జరిగింది. దరియాలతిప్ప వద్ద బోటులో నుంచి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో బోటులో చిక్కుకున్న గంగాద్రి అనే వ్యక్తి మంటల్లో సజీవదహనమయ్యారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇక, ప్రమాదానికి గురైన బోటు భైరవపాలెం నుంచి గౌతమి నది నుంచి దరియాలతిప్పకు వచ్చినట్టు గుర్తించారు.

# గంజాయికి బానిసై విద్యార్థి ఆత్మహత్య

## ఘట్‌కేసర్ వద్ద దుర్ఘటన



**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** ఘట్‌కేసర్‌లో ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య కలకలం రేపుతోంది. గంజాయికి బానిసై బీటెక్ విద్యార్థి విజయ్‌కుమార్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. బీబీనగర్ వైపు నుంచి సనత్‌నగర్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని.. అతని వద్ద లభించిన పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర పత్రాల ఆధారంగా మృతుడు నారపల్లిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి విజయకుమార్(27)గా గుర్తించారు. ఈ క్రమంలో కళాశాల నిర్వాహకులకు, పెద్ద చర్లపల్లిలోని తండ్రి శ్రీనివాస్‌కు పోలీసులు సమాచారం ఇచ్చారు. బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విజయ్‌కుమార్ ఇంటర్ నుంచే గంజాయికి అలవాటుపడ్డాడు. అయితే నగరంలో పోలీసుల కట్టడితో గంజాయి లభించక పోవడంతో మానసిక ఒత్తిడికి లోనైన విద్యార్థి ఇలా ప్రాణాలు తీసుకున్నాడు. గంజాయిని మానిపించేందుకు కుటుంబసభ్యులు ఎంతగానో ప్రయత్నాలు చేశారు. చెడు అలవాట్లకు బానిసైన విజయ్ దానిలో నుంచి బయటపడలేకపోయాడు. చదువుకుంటానని చెప్పడంతో తల్లిదండ్రులు అతడిని ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పించారు. అయితే ఇటీవల కాలంలో గంజాయి దొరక్కపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురైన విజయ్ కుమార్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘట్‌కేసర్‌లోని ఓ కళాశాలలో డిప్లమో చదువుతున్నప్పుడే గంజాయికి అలవాటుపడినట్లు, తరువాత పాతబస్తీలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చేర్పించగా.. అక్కడగా వ్యసనానికి బానిసైనట్లు తండ్రి శ్రీనివాస్ తెలిపారు. మొదటి సంవత్సరంలో అన్ని స్జబెక్టుల్లో ఫెయిల్ కావడంతో చదువు మానిపించి చర్లపల్లిలో చికెన్ సెంటర్ పెట్టించారు. విజయ్‌కుమార్ మానసికంగాను కుంగిపోవడంతో సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఎడిక్షన్ కేంద్రంలో చికిత్స చేయిస్తున్నారు.అయినా పూర్తిగా కోలుకోకపోగా.. చదువుకుంటానని చెప్పడంతో నార్లపల్లిలోని కళాశాలలో రెండో సంవత్సరంలో చేర్పించారు. అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. కొద్ది నెలలుగా తన మనసు బాగుండటం లేదని, ఆత్మహత్య చేసుకుంటానని చెబుతుండటంతో తల్లిదండ్రులు ధైర్యం చెప్పారు. అయినా కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు: జూపల్లి



**నాగర్‌కర్నూలు,జనవరి6(సమసమాజం):** గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పదేళ్ల పాలనలో గ్రామాలు, తండాల్లో సౌకర్యాలు లేవని అభివృద్ధి శూన్యమని అన్నారు. ఎల్లారం తండాకు ఇప్పటి వరకు ఎమ్మెల్యే ఎంపీ వచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. కామారెడ్డి జిల్లాలోని కౌలాస్ కోటను అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి రెండు హామీలు నెరవేర్చారని జూపల్లి అన్నారు. ఆరు గ్యారెంటీల అమలుకే ప్రజా పాలనలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. దశల వారీగా మిగితా హామీలను అమలు చేస్తామని చెప్పారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకు ప్రజా పాలన తెచ్చామని జూపల్లి కృష్ణారావు చెప్పారు.

# టెక్కీ సురేందర్‌ను కాపాడిని పోలీసులు

**నంద్యాల,జనవరి6(సమసమాజం):** హైదరాబాద్ రాయదుర్గంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కిడ్నాప్ కేసును పోలీసులు ఛేదించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సురేందర్‌ను కిడ్నాపర్ల చెర నుంచి పోలీసులు కాపాడారు. సురేందర్‌ను కిడ్నాప్ చేసిన కిడ్నాపర్లు రూ. 2 కోట్లు డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు దగ్గర సురేందర్‌ను పోలీసులు కాపాడారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను కిడ్నాప్ చేసి హైదరాబాద్‌లోని రాయదుర్గం నుంచి నల్లమల అడవులకు తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఆత్మకూరు పోలీసులు అప్రమత్తమయ్యారు. కిడ్నాపర్ల కోసం నల్లమలలో పోలీసులు గాలిస్తున్నారు.

# మరోమారు 2వేల నోట్ల మార్పిడి అవకాశం

## ఆర్‌బిఐ, పోస్టాఫీసుల్లో మార్చుకునే ఛాన్స్

**ముంబై,జనవరి6(సమసమాజం):** గతేడాది మేలో రద్దు చేసిన రూ.2000 నోట్లకు సంబంధించి భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. విలువైన రూ.2000 నోట్ల మార్పిడి కోసం పౌరులకు మరో అవకాశం కల్పించింది. దేశంలోని ఆర్‌బీఐ కార్యాలయాలు, పోస్టాఫీసుల వద్ద పెద్దనోట్లను మార్చుకోవచ్చని తెలిపింది. అయితే ఇందుకు గడువును మాత్రం నిర్ణయించలేదని తెలిసింది.అయితే రూ.2000 నోట్లు మార్చుకునే పౌరులు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో లభిస్తున్న దరఖాస్తు ఫామ్ నింపి పోస్టాఫీసు ద్వారా ఆర్‌బీఐకి పంపవచ్చని రిజర్వ్ బ్యాంక్ చెప్పింది. క్లీన్ నోట్ పాలసీలో భాగంగా గతేడాది మే నెలలో రూ.2000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్లు భారతీయ సెంట్రల్ బ్యాంక్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ముందుగా ప్రజలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న అప్లికేషన్ ఫారమ్‌ను పూర్తిచేయాలి. ఆ తర్వాత దగ్గర్లోని ఏదైనా స్థానిక పోస్టాఫీసు నుంచి రూ.2000 నోట్లను ఆర్‌బీఐ ఇష్యూ ఆఫీసులకు పంపాలి. ఎఫ్ఏక్యూలో సమాచారం ప్రకారం ఒక వ్యక్తి పోస్టాఫీసు బేస్డ్ ఫెసిలిటీలతో పాటు 19 ఇష్యూ కార్యాలయాల్లో ఒకేసారి రూ.20,000 వరకు నోట్లను మార్చుకోవచ్చు.

# మాజీ రాష్ట్రపతితో సిఎం భేటీ

## మాజీ గవర్నర్ నరసింహన్ రాక

**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** హైదరాబాద్ రాజ్‌భవన్‌లో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను సిఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి సన్మానించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇదిలావుంటే మాజీ గవర్నర్ నరసింహన్ శనివారం సిఎం రేవంత్‌ను కలిశారు. మర్యాదపూర్వకంగానే కలిసినట్లు తెలిపారు. సిఎం ఆయనను ఉచితరీతిన సత్కరించారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ లభించి కాంగ్రెస్ అధికారం చేపట్టింది. సిఎంగా రేవంత్ ప్రమాణం చేసి పాలన సాగిస్తున్నారు. సరిగ్గా నెలరోజులు కావచ్చింది. ఈ క్రమంలో ఇద్దరు ప్రముఖులను కలవడం విశేషం.

# బేగంపేట ఫ్లై ఓవర్‌పై కారు పల్టీ

## వ్యక్తికి గాయాలు..ఆస్పత్రికి తరలింపు



**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** నగరంలోని బేగంపేటలో శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. బేగంపేట ఫ్లై ఓర్‌పై వేగంగా దూసుకొస్తున్న ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. కాగా.. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని వ్యక్తిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పల్టీకొట్టిన కారును ట్రాఫిక్ పోలీసులు అక్కడి నుంచి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు

## జోనల్ కమిషనర్ మమత బదిలీ



**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు, కూకట్ పల్లి జోనల్ కమిషనర్ మమత బదిలీ అయ్యారు. ఆమెను నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ డైరెక్టర్ గా నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో 13 ఏండ్లుగా కూకట్ పల్లిలో విధులు నిర్వర్తిస్తున్న మమతకు కాంగ్రెస్ సర్కారు షాక్ ఇచ్చినట్లయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక నేతలతో ఉన్న సంబంధాల కారణంగా జోనల్ కమిషనర్ గా కొనసాగినట్లు ఆరోపణలు వచ్చాయి. గతంలో జూబ్లీహిల్స్ కు డిప్యూటీ కమిషనర్ గా ట్రాన్స్ ఫర్ చేస్తే.. 24గంటల్లో షేరిలింగంపల్లి సర్కిల్ కు ట్రాన్స్ ఫర్ చేయించుకున్నారు. ఎన్నికలకు ముందు ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ గా బదిలీ చేస్తే.. 24గంటల్లో కూకట్ పల్లి జోనల్ కమిషనర్ గా బదిలీ చేయించుకున్నారు. ప్రస్తుతం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ రెడ్డిని హ్యాండ్లూమ్, టెక్స్ టైల్ అడిషనల్ డైరెక్టర్ గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో స్నేహా శబరీశ్ ను నియమించింది. మూసీ రివర్ ఫ్రంట్ ఎండీగా జీహెచ్ఎంసీ సూపరింటెండెట్ ఇంజినీర్ వెంకటరమణను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు ఇచ్చింది.

# ఎపిలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల వేడి

## ఎన్నికలపై అధికార వైసిపి కసరత్తు

## ఎన్నికల సంఘం సమీక్షలు పూర్తి

## 7నుంచి ఇసి బృందం పర్యటించే అవకాశం

**న్యూఢిల్లీ,జనవరి6(సమసమాజం):** ఏపీలో అసెంబ్లీతో పాటు లోక్‌సభ ఎన్నికల వేడి మొదలైంది. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల కసరత్తులో నిమగ్నమయ్యాయి. ఇప్పటి నుంచే అభ్యర్థులను ఎంపిక చేసుకునే విషయంలో అదికార వైసిపి బిజీగా ఉంది. సిఎం జగన్ అబ్యర్థులతో మంతనాలు చేస్తున్నారు. అభ్యర్థులను మార్చేస్తున్నారు. కొందరికి ఏకంగా టిక్కెట్లు నిరాకరిస్తున్నారు. ఏపీలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రారంభించింది. ఇప్పటికే సీఎస్ జవహర్ రెడ్డి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. అలాగే కేంద్ర ఎన్నికల సంఘం బృంద సభ్యులు ఇప్పటికే ఎపిలో పర్యటించి సమీక్షలు చేపట్టారు. త్వరలోనే షెడ్యూల్ ను విడుదల చేస్తామని ఇసి ప్రకటించింది. ఈ క్రమంలోనే ఏపీలో ఎన్నికలు మొదటి దశలోనే ముగించేలా ప్రణాళికలు రచిస్తోంది. దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలతో పాటూ ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఏపీ అసెంబ్లీ, లోక్ సభతో పాటు, తమిళనాడు లోక్ సభకు తొలి దశలోనే ఎన్నికలు పూర్తి చేయాలని యోచిస్తోంది. జనవరి 7 నుంచి లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ముందుగా తమిళనాడులో పర్యటించనుంది. అక్కడి 39 లోక్ సభ స్థానాలకు సంబంధించిన పోలింగ్ నిర్వహణపై ఉన్నతాధికారులతో భేటీ అవనున్నారు. ఆ తరువాత జనవరి 9,10 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. జిల్లా స్థాయి అధికారులతోపాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని శాఖల అధికారులతో సంప్రదింపులు జరుపుతారు. అలాగే ఓటర్ల జాబితాలోని లోపాలను, ఇప్పటికే సిద్ధమైన ముసాయిదాలోని లోపాలను పరిశీలించనున్నారు. జనవరి చివరి వారానికి తుది ఓటర్ల జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు ఏపీలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు గతంతో నిర్వహించినట్లుగా తొలిదశలోనే ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. 2019లో ఏప్రిల్ 11న ప్రారంభమైన ఎన్నికల పక్రియ మే 19తో ముగిసింది. ఇందులో దేశ వ్యాప్తంగా లోక్ సభ, పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగినట్లు తెలిపింది ఎన్నికల సంఘం. ఈసారి దేశ వ్యాప్తంగా జరిగే లోక్ సభ ఎన్నికలను ఆరు లేదా ఏడు విడతల్లో నిర్వహించాలని భావిస్తోంది. అందుకు అనుగుణంగా కార్యచరణను రూపొందించి ముందుకు సాగుతోంది.

# మేడారం జాతరకు 75 కోట్లు మంజూరు

(మొదటి పేజీ తరువాయి) సమన్వయంతో పని చేసి.. జాతర పనులు పూర్తి చేయాలని ఆమె కోరారు. జాతరకు వచ్చే భక్తుల ప్లాస్టిక్ వినియోగం తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. జనవరి నెల చివరివరకు జాతర పనులు పూర్తి చేస్తామని అన్నారు. రాష్ట్ర స్థాయిలో సీఎం డిప్యూటీ సీఎంతో జాతరపై రివ్యూ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాతర జరుగు తేదీలతో మరొకసారి పోస్టర్లు విడుదల చేస్తామని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, మినిస్టర్లు, వీఐపీలకు ప్రత్యేక ఆహ్వానం ద్వారా వారిని ఆహ్వానిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మేడారం జాతరకు ప్రత్యేక హోదా కల్పిస్తారని ఆశిస్తున్నామని మంత్రి సీతక్క కోరారు.



# త్వరలోనే ప్రజల్లోకి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు త్వరలోనే జిల్లాలలో పర్యటిస్తారని ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీష్‌రావు వెల్లడించారు. శనివారం తెలంగాణ భవన్‌లో పెద్దపల్లి పార్లమెంటు నియోజక వర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ త్వరగా కోలుకుంటున్నారని, సంపూర్ణ ఆరోగ్యవంతుడై ప్రజల మధ్యలోకి వస్తారని పేర్కొన్నారు. ఫిబ్రవరిలో తెలంగాణ భవన్‌కు వచ్చి ప్రతి రోజూ కార్యకర్తలను కలుస్తారని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్లపై కేసీఆర్ గుర్తును తొలగించినా తెలంగాణ ప్రజల గుండెల నుంచి తొలగించలేరని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను రద్దులు చేస్తూ వాయిదాలు వేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలపై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు దిగితే ఎమ్మెల్యేలంతా బస్సు కట్టుకుని బాధితుల వద్దకు వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. తెలంగాణ కోసం ఉద్యమంలో రాజీనామాలు చేశాం తప్ప రాజీ పడలేదని అన్నారు. ప్రభుత్వ తీరును చూస్తుంటే ఏడాదిలోనే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదనిపిస్తోందని తెలిపారు. ప్రభుత్వానికి అందజేసిన ధాన్యం డబ్బులను, రైతుబంధు పథకం డబ్బులను ప్రభుత్వం వేయలేదని పేర్కొన్నారు. పదేండ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినా ప్రతిపక్షాల దుష్ప్రచారం వల్ల ఓడిపోయామని అన్నారు. మొన్నటి ఎన్నికలు కేవలం స్పీడ్ బ్రేకర్ లాంటిదని అన్నారు. 'తొలిసారి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నాం, సత్తా ఏమిటో చూపిద్దామని ' కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పెద్దపల్లి పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని, ముందు ముందు మంచి రోజులు వస్తాయని అన్నారు

# పెద్దపల్లిలో గులాబి జెండా ఎగరేస్తాం

## కాంగ్రెస్ ప్రచారమే తప్ప పనితనం లేదు

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

**హైదరాబాద్,జనవరి6(సమసమాజం):** పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే బాల్క సుమన్ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా పెద్దపల్లి నియోజకవర్గ నాయకులతో శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం బాల్క సుమన్ మాట్లాడుతూ.. నేతలు సూచనలు, అభిప్రాయాలను పెద్దలు స్వీకరించారని తెలిపారు. సమష్టి కృషితో పనిచేయాలని నిర్ణయించారని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో గెలుపుపై పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ పని తక్కువ.. ప్రచారం ఎక్కువ అన్నట్టు ఉందని బాల్క సుమన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు బీఆర్ఎస్ కార్యకర్తలపై ఎందుకు దాడులకు దిగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రైతుబంధు కింద విడుదల చేసిన డబ్బులు ఏమైపోయాయని ప్రశ్నించారు. గత ప్రభుత్వం పథకాలకు ఇచ్చిన ప్రోసీడింగ్



నిలిపివేడయం సరికాదని అన్నారు. ప్రజాపాలన పేరుతో హామీల అమలును వాయిదా వేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అసెంబ్లీ ముందు కంచెలు ఎందుకు కూలగొట్టలేదని ప్రశ్నించారు. ప్రజాపాలన పేరుతో దరిద్రపు పాలన చేస్తున్నారని అన్నారు.

# ఆరు గ్యారెంటీలతో బిఆర్ఎస్‌లో వణుకు

(మొదటి పేజీ తరువాయి)అయిందని బీఆర్ఎస్ నాయకులు చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండి అర్హులైన ఏ ఒక్కరికీ కూడా ఇంటి స్థలం ఇవ్వలేదని.. కొత్త ఇళ్లను నిర్మించలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి, భవిష్యత్తు తరాలను తాకట్టుపెట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక అరాచకంపై ప్రజలకు వాస్తవాలు తెలియాలని అసెంబ్లీలో శ్వేత పత్రాలను విడుదల చేశామని చెప్పారు. కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా.. అన్న బీఆర్ఎస్‌కు చెంపపెట్టు లాగా కరెంటు కావాలి.. కాంగ్రెస్ కావాలి అని ప్రజలు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతమైన తీర్పు ఇచ్చారన్నారు. విద్యుత్తు రంగంపై 1.10 లక్షల కోట్ల రూపాయల అప్పుల భారాన్ని గత ప్రభుత్వం మోపినప్పటికీ.. ఆ ఇబ్బందులను అధిగమిస్తూ రాష్ట్ర ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు ఇస్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# మహాలక్ష్మి అద్భుతంగా అమలు: ఆర్టీసీ ఎండి

(మొదటి పేజీ తరువాయి)నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హాజరయ్యారు. అనంతరం విధి నిర్వహణలో అద్భుతంగా పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ .. ఆర్టీసీలో వనభోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులంతా స్నేహపూర్వక వాతావరణంలో కలిసి వనభోజనాలు కార్యక్రమం చేసుకోవడం మంచి పరిణామమని చెప్పారు. టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ వేణుగోపాల్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# 13 నుంచి ఇంటర్ విద్యార్థులకు సెలవులు

(మొదటి పేజీ తరువాయి) చర్యలు తీసుకుంటామని బోర్డు హెచ్చరించింది. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సెలవులు ఇచ్చింది. తిరిగి 17వ తేదీన కళాశాలలు ప్రారంభమవుతాయని తెలిపింది.

# మరో ఘనత సాధించిన ఇస్రో

(మొదటి పేజీ తరువాయి) హాలో కక్ష్య నుంచి ఇది నిరంతరం సూర్యున్ని పర్యవేక్షిస్తుంది. ఈ విషయాన్ని ప్రధాని మోడీ ట్వీట్ చేసి తెలిపారు. ప్రయోగం విజయవంతం చేసిన శాస్త్రవేత్తలను అభినందించారు. భారతదేశం మరో మైలురాయిని చేరిందని ప్రకటన చేశారు. భూమి నుంచి సూర్యుని దిశగా 15 లక్షల కిలోమీటర్ల దూరంలో గల లగ్రాంజ్ పాయింట్ చుట్టూ ఉన్న హాలో కక్ష్యలోకి ఆదిత్య ఎల్1ను శాస్త్రవేత్తలు పంపించారు. అక్కడ సూర్యుడిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. సౌర వాతావరణాన్ని లోతుగా అధ్యయనం చేయడం ఆదిత్య ఎల్ 1 లక్ష్యం. సూర్యుడిని పరిశోధించేందుకు ఇస్రో చేపట్టిన తొలి మిషన్ ఇదేననే సంగతి తెలిసిందే. గత ఏడాది సెప్టెంబర్ 2వ తేదీన శ్రీహరికోట నుంచి ప్రయోగం చేపట్టారు. వ్యోమనౌక ఏడు పేలోడ్లను మోసుకెళ్లింది. సౌర వాతావరణం, సౌర జ్వాలలు, కరోనల్ మాస్ ఎజెక్షన్ తదితర అంశాలను అధ్యయనం చేసేందుకు కీలక సమాచారాన్ని ఆదిత్య ఎల్1 అందించనుంది.

# అయోధ్యలో శరవేగంగా ప్రాణప్రతిష్ట ఏర్పాట్లు

## దేశవ్యాప్తంగా 6వేలకు పైగా ప్రముఖుల హాజరు

## భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టిన పోలీసులు

## రెడ్, ఎల్లో జోన్లుగా విభజించిన అధికారులు

**అయోధ్య,జనవరి6(సమసమాజం):** అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. జనవరి 22న జరిగే ఈ మహత్తర కార్యక్రమానికి హాజరుకావల్సిందిగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్.. దేశవ్యాప్తంగా ప్రముఖులకు ఆహ్వానాలు పంపుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా 6,000 మందికి పైగా ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. మరికొద్ది రోజుల్లో అయోధ్యలో జరగనున్న రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 16 నుంచి ప్రారంభమయ్యే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జనవరి 22 వరకు కొనసాగనుంది. ఈ సమయంలో భద్రతా సిబ్బందిని అయోధ్య లోని వివిధ ప్రాంతాల్లో మోహరించనున్నారు. డీజీపీ ప్రశాంత్ కుమార్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం జనవరి 22న ఆలయ విధుల్లో పాల్గొనే పోలీసులెవరూ స్మార్ట్ ఫోన్‌లను ఉపయోగించకూడదు. అలాగే ఈ



వేడుక ముగిసిన నాలుగు రోజుల తర్వాత జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో భద్రతా సిబ్బంది స్మార్ట్ మొబైల్ ఫోన్‌లను ఉపయోగించకూడదని డీజీపీ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. రామమందిర సముదాయానికి సంబంధించిన సమగ్ర భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఈ ప్రాంతాన్నంతటినీ రెడ్, ఎల్లో జోన్‌లుగా విభజించారు. రామజన్మభూమి కాంప్లెక్స్‌ను రెడ్ జోన్‌లో ఉంచారు. 6 కంపెనీల సీఆర్‌పీఎఫ్, 3 కంపెనీల పీఏసీ, 9 కంపెనీల ఎస్ఎస్ఎఫ్, 300 మంది పోలీసు సిబ్బంది, 47 మంది అగ్నిమాపక సిబ్బంది, 38 మంది ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, 40 మంది రేడియో పోలీసు సిబ్బందికి రామాలయం, దాని ప్రాంగణం భద్రత బాధ్యతలు అప్పగించారు. అయోధ్య భద్రతకు రూ.90 కోట్ల బ్జడెట్ కేటాయించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద అయోధ్యలో ఏఐ ఆధారిత వ్యవస్థను కూడా అమలు చేయనున్నారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌కు చెందిన రెండు బృందాలు, రెండు విధ్వంసక నిరోధక దళాలు, పీఏసీకి చెందిన ఒక కమాండో యూనిట్, ఎటీఎస్, ఎస్‌టీఎఫ్‌లకు చెందిన ఒక్కో యూనిట్, ఎన్ఎస్‌జీతో సహా సెంట్రల్ ఏజెన్సీలను కూడా ఆలయ భద్రత విధుల్లో మోహరించనున్నారు. ఎల్లో జోన్‌లోని కనక్‌భవన్, హనుమాన్‌గఢి ప్రాంతాల్లో కూడా పటిష్ట భద్రత ఉంటుంది. ఎల్లో జోన్‌లో 34 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 71 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 312 మంది కానిస్టేబుళ్లు భద్రతను పర్యవేక్షించనున్నారు.

# జోరుగా పెండింగ్ చలాన్ల క్లియరెన్స్



(మొదటి పేజీ తరువాయి) రాష్ట్రవ్యాప్తంగా 76లక్షలకు పైగా చలాన్లను క్లియర్ చేసుకున్నారు. రాష్ట్రంలో మూడు కోట్ల 59 లక్షల పెండింగ్ చలాన్స్ కట్టాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 77 లక్షల చలాన్లు క్లియర్ చేసినట్లు హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వ ప్రసాద్ తెలిపారు. ఈ చలాన్లకు సంబంధించి శనివారం వరకు రూ. 67 కోట్లు వసూలయ్యాయని పేర్కొన్నారు. హైదరాబాద్ కమిషరేట్‌లో రూ. 18 కోట్లు, సైబరాబాద్ కమిషనరేట్‌లో రూ. 14 కోట్లు, రాచకొండ కమిషనరేట్‌లో రూ. 7.15 కోట్లు వసూలయ్యాయని చెప్పారు. ట్రాఫిక్ చలాన్ల వెబ్‌సైట్‌లో ఎలాంటి ఇబ్బందులు లేవని, ఫేక్ చలాన్ వెబ్‌సైట్‌లను నిలిపివేశామని తెలిపారు. మరోవైపు.. చలాన్ల పెండింగ్‌పై వాహనదారుల స్పందనను గమనించిన ప్రభుత్వం.. చలాన్ల చెల్లింపులపై మరింత వెసులుబాటు కల్పించింది. ఈనెల పదో తేదీ వరకు డిస్కౌంట్‌తో చలాన్లను చెల్లించేందుకు అవకాశం ఇచ్చింది.

# ముగిసిన ప్రజాపాలన దరఖాస్తులు

(మొదటి పేజీ తరువాయి) ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులకు సంబంధించిన డేటా ఎంట్రీ జనవరి 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరగనుంది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రూ.500కే సిలిండర్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా, రూ.5లక్షల యువ వికాసం, మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.2,500 సాయం, రూ.4వేల పింఛన్లు, రేషన్ కార్డులు, రైతు భరోసాలాంటి హామీలను ఇచ్చింది. అధికారంలోకి రావడంతో ఇప్పటికే ఆరోగ్యశ్రీ, ఉచిత ప్రయాణం ప్రారంభించగా.. మిగిలిన గ్యారెంటీల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశంతో ఈ నెల 28వ తేదీ నుంచి ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభమైంది. గత నెల 28వ తేదీ నుంచి ఇవాళ సాయంత్రం వరకు అభయహస్తం దరఖాస్తులు స్వీకరించారు.

**Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*,** Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
**Printed at *Panidhar PUBLICATIONS.*** Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU*,**
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in